# 'ఒక హిజ్రా ఆత్మకథ' - రాజ్యాంగ నైతికతా పాఠం

*సెక్సువల్ మైనారిటీల హక్కులను గుర్తించడం, పరిరక్షించడం భారత రాజ్యాంగ నైతికతలోనూ, ప్రజాస్వామిక సంప్రదాయంలోనూ భాగమంటున్నారు* **కల్పన కన్నబిరాన్**

**నైతిక చట్రంగా రాజ్యాంగం**

'ట్రాన్స్‌జండర్ కమ్యూనిటీ సభ్యులు గురయ్యే యాతన, వేదన, బాధలను సమాజం చాలా అరుదుగా గుర్తిస్తుంది, గుర్తించాలనే శ్రద్ధ కూడా చూపించదు. ముఖ్యంగా ఎవరి శారీరక లైంగికతను వారి మనసూ, శరీరం కూడా తమవి కావని తిరస్కరిస్తాయో వారి లోలోపలి అనుభూతులను సమాజం హర్షించదు. ట్రాన్స్‌జండర్ కమ్యూనిటీని మన సమాజం అవహేళన చేస్తుంది. నిందిస్తుంది. తిడుతుంది. రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండులు, పాఠశాలలు, పనిచేసే ప్రదేశాలు, పెద్ద దుకాణాలు, సినిమాహాళ్లు, ఆసుపత్రులు మొదలైన బహిరంగ ప్రదేశాలలో వాళ్లను పక్కకు నెట్టేస్తారు. అంటరాని వాళ్లుగా చూస్తారు. సమాజం భిన్న అస్తిత్వాలను, వ్యక్తీకరణలను ఆమోదించి అక్కున చేర్చుకోదు. మనం మార్చాల్సిన ఆ ఆలోచనా ధోరణి తన నైతిక ఓటమి అనే వాస్తవాన్ని సమాజం మర్చిపోతుంది'.

(సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా ఇన్ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా అండ్ అదర్స్, రిట్ పిటిషన్ (సివిల్) నం.604 ఆఫ్ 2013, పేరా 1)

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుకి మూడు ఏళ్ల ముందు నాజ్ ఫౌండేషన్ తీర్పులో ఢిల్లీ హైకోర్టు రాజ్యాంగానికి ఒక కొత్త వ్యాఖ్యానాన్ని ఆవిష్కరించింది. సెక్సువల్ మైనారిటీల (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జండర్, క్వీర్ వ్యక్తులు) హక్కులు ఇప్పుడు వివక్ష, అణచివేత, సాంఘిక వెలి, స్వేచ్ఛా నిరాకరణ అనే వాటి గురించీ, స్వేచ్ఛ గౌరవాల అర్థాల గురించీ సామాన్య అవగాహన కలిగించే దారి దీపాలు అయ్యాయి. ప్రజలందరి మానవహక్కులను, వారి సెక్సువల్ ఓరియంటేషన్‌తో, జండర్ అస్తిత్వంతో సంబంధం లేకుండా దేశీయ ప్రభుత్వాలు గౌరవించి రక్షించి వారి అనుభవంలోకి తేవాలని అంతర్జాతీయ మానవహక్కుల స్థాయిలు విస్తరించి, వివిధ దేశాలు గౌరవించాల్సిన తప్పనిసరి ఒప్పందంగా చాలా వివరంగా చెప్పిన మాటలే ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టులకు మార్గదర్శకాలయ్యాయి. బాబాసాహెబ్ అంబేద్కర్‌ని పేర్కొంటూ, ఆయన మాటలను గుర్తుచేస్తూ కోర్టు పబ్లిక్ నైతికతకు వ్యతిరేకంగా రాజ్యాంగ నైతికతను ఎత్తిచూపవలసిందిగా ప్రభుత్వాన్ని కోరింది. 'భారత రాజ్యాంగం భిన్నత్వాన్ని గుర్తిస్తుంది. రక్షిస్తుంది. ప్రాధాన్యతనిస్తుంది. కేవలం వారి సెక్సువల్ ఓరియంటేషన్ కారణంగా హోమోసెక్సువల్స్‌ని నిందిస్తూ ముద్రవేయడం, నేరస్తులుగా చూడడం అనేది రాజ్యాంగ నైతికతకు విరుద్ధం' (పేరా 80).

కోర్టు ఇంకా ముందుకెళ్లి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15ని 'ఏ పౌరులైనా ఇతరులను కులం, లింగం, ఇతర ప్రత్యేక కారణాల వల్ల బహిరంగ స్థలాలను వినియోగించుకోకుండా నిరోధించరాదనే' దానిలోని సెక్స్ (లింగం) అనే పదం కోర్టు దృష్టిలో స్త్రీ, పురుషులకు మాత్రమే వర్తించదు, సెక్సువల్ మైనారిటీలందరికీ వర్తిస్తుంది, వారిలో ట్రాన్స్‌జండర్లు ముఖ్యమైన భాగం అని కూడా చెప్పింది. సెక్సువల్ ఓరియంటేషన్, జండర్ అస్తిత్వాలను అర్థం చేసుకోడానికి ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రకటనను అన్వయిస్తూ హైకోర్టు తన తీర్పులో మూడు విధాలైన రక్షణలను ముందుకు తెచ్చింది. అవి ఎ) వివక్షారాహిత్యం బి) ప్రైవేట్ హక్కుల రక్షణ సి) సెక్సువల్ ఓరియంటేషన్ జండర్ అస్తిత్వాలతో సంబంధం లేకుండా అందరికీ ప్రత్యేక, సాధారణ మానవహక్కుల రక్షణకు హామీ ఇవ్వడం.

(నాజ్ ఫౌండేషన్ అండ్ అదర్స్ వర్సెస్ గవర్నమెంట్ ఆఫ్ ఎన్‌టిసి ఆఫ్ ఢిల్లీ అండ్ అదర్స్, 2009 (160) ఢిల్లీ లా టైమ్స్ 277)

వివక్షారాహిత్యం, స్వేచ్ఛ అనేవి రాజీపడకూడనివి అనే భావనే రాజ్యాంగానికి పునాదిగా ఉంది. అది రాజ్యాంగ నైతికతా భావన. మన సమాజంలో 'సహజంగా' ఏర్పడి ఉన్నవికావు. తప్పనిసరిగా పౌరులందరూ మినహాయింపు లేకుండా అలవర్చుకోవలసినవి. సెక్సు మీద ఆధారపడిన వివక్షా రాహిత్యం కీలకమైన రాజీబేరాల్లేని హక్కు. దాని గురించి హేతుబద్ధం కాని అభిప్రాయాలు అభ్యుదయ శక్తుల నుంచి వచ్చినా 'తప్పనిసరిగా అలాగే వస్తాయి'. ఈ హక్కు వాటినెదుర్కొని నిలబడాలి. రాజకీయమైన రాడికలిజం ఎప్పుడూ తీవ్రోన్మాదపూరిత సంప్రదాయ శక్తులతో సుఖంగా ఇమిడిపోతూ జతకడుతుంది. ముఖ్యంగా

**ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల బిల్లు ఆమోదం**

ట్రాన్స్‌జెండర్ (లింగాతీత) వ్యక్తుల విద్యా, ఉద్యోగ, భద్రత హక్కులను పరిరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని కోరుతూ తమిళనాడుకు చెందిన తిరుచ్చి శివ ప్రవేశపెట్టిన ప్రైవేట్ సభ్యుడి బిల్లును ఏప్రిల్ 24న రాజ్యసభ ఆమోదించింది. ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు ప్రభుత్వ లెక్కల ప్రకారం ఐదు లక్షల మంది ఉండగా, వాస్తవంగా 20-25 లక్షలు ఉన్నారనీ, వారు అసమానతను, వివక్షను, అవమానాన్ని ఎదుర్కొంటున్నారనీ, వారి రక్షణ కొరకు ఇటువంటి చట్టం కావాలనీ శివ అన్నారు. భాజపా సభ్యులు ముందు వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం తరపున ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఇటువంటి చట్టం తేవాలని ప్రభుత్వం కూడ ఆలోచిస్తున్నదని అనడంతో మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది.

స్త్రీ పురుషుల లైంగిక కలయిక మీద ఆధారపడిన పితృస్వామ్యం, జండర్ ఆధిపత్యాల విషయంలో వారిద్దరివీ ఒకే అభిప్రాయాలవుతాయి.

గౌరవంగా శారీరక సమగ్రతతో జీవించడానికున్న రాజ్యాంగహక్కు హిజ్రా హక్కు కూడా!

సాహిత్యం మానవ అనుభవాలకు కిటికీలు తెరుస్తుంది. జస్టిస్ స్టీవెన్ బ్రెయిర్ చెప్పినట్లు సాహిత్యం మన అనుభవాలకూ, వాటికి పూర్తిగా భిన్నంగా ఉండే అనుభవాలకూ మన మనసులను తెరుస్తుంది. అలా చేయడం ద్వారా మన ఆలోచనా దిగంతాలను, అవగాహనను, సహానుభూతులను లెక్కించలేనంతగా విశాలం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. సాహిత్యం మన మేధాపరమైన చెరసాలల నుంచి మనల్ని విముక్తం చేస్తుంది. పద్ధతుల గురించి, నీతి గురించి, ఏది సరైన ప్రవర్తన అనుకుంటామో దాని గురించి, మానవత్వం గురించి మనకున్న ప్రాథమిక ఊహలను కూలగొడుతుంది. అందువల్లే సాహిత్యం చాలా తీవ్రమైన దాడులకు, అసహనానికీ గురవుతుంది. ఈ అసహనం అతి వేగంగా రచన నుంచి రచయిత శరీరానికీ, జీవితానికీ వ్యాపిస్తుంది. రచయిత ఆధిపత్య సాంఘిక గ్రూపుకు చెందకుండా, పురుషుడు కాకుండా ఉన్నట్లయితే ఈ అసహనం ప్రకటించే పద్ధతులు మరింత తీవ్రంగా ఉంటాయి. సెక్సువల్ మైనారిటీల పైనా స్త్రీలపైనా ఈ దాడులు ఎప్పుడూ వ్యక్తిగతంగా, వాయురిస్టిక్‌గా ఉంటాయి. రచయిత గౌరవం, ప్రైవసీ హక్కుల పట్ల వీటికి ఏమాత్రం గౌరవం ఉండదు.

రేవతి రాసిన 'ఒక హిజ్రా ఆత్మకథ' మనలను కదిలించే స్వీయ నివేదిక. ఆమె లైంగిక అస్తిత్వం, తనమీద పడిన నిందాముద్రపై, వివక్షపై ఇంటా బైటా చేసిన పోరాటాల నివేదిక. ఆమెకున్న అత్యంత ధైర్యసాహసాలు, తన చుట్టూ ఉన్న వ్యతిరేక వాతావరణంలో తన జీవితాన్ని అర్థవంతం చేసుకోవాలనే పట్టుదల ఇవన్నీ మనల్ని మన గురించిన సత్యాన్ని మరల పరీక్షించుకోమని బలవంతపెడతాయి. ఆ పుస్తకం మనల్ని ప్రత్యేక సదుపాయాలు, సహాయ సహకారాలనే ఆధారాల గురించి పునరాలోచించమని ఒత్తిడి పెడుతుంది. ఆధిపత్య భావజాలం అనే బోనులోంచి మనల్ని విడుదల చేసుకోమంటుంది. రేవతి ప్రపంచం మన నుండి వేరు కాదు. మనలోపల దాగి ఉన్నదే.

జండర్ ఒక సాంఘిక ప్రపంచాన్ని సంపూర్ణంగా ఆవిరి చేస్తుంది. జండర్ అస్తిత్వం అనేక భిన్న మార్గాలలో, పద్ధతులలో ఒకేసారి నిర్మించబడుతుంది. అంతాకలిసి, మళ్లీ ఒకదానితో ఒకటి సంభాషించు కుంటూ జుడిత్ బట్లర్ చెప్పినట్లు 'జండర్ గురించిన ఆధిపత్య భావన ఒకరి వ్యక్తిత్వాన్ని హరించి వేయగలదు. జీవితంలో ఓటములను దాటుకుంటూ కొనసాగగల పట్టుదలకున్న సామర్థ్యాన్ని ఆ ఆధిపత్య భావన తగ్గించి చూస్తుంది.' రేవతి జీవిత కథ ద్వారా మనం జండర్ కేవలం శారీరకపరమైనది (బయలాజికల్) మాత్రమే కాదని తెలుసుకుంటాం. అది వ్యక్తిత్వం, అస్తిత్వం, గౌరవం, హుందా తనం, పని, వేషధారణ, నడక తీరు, ప్రవర్తన, సంభాషణ, ఇష్టాలు, అయిష్టాలు, ప్రేమలు, కోరికలు వీటన్నిటితో కలిసి ఉంటుంది.

ఆడ పనుల మీద రేవతికున్న ఇష్టం వల్ల, బాలికలు ఆడే ఆటలంటే ఉన్న ఇష్టం వల్లా ఆమెను చిన్నతనంలోనే బడి 'ఆడబ్బాయి'గా ఏడిపించింది. అప్పుడామె తన తల్లిదండ్రుల చిన్నకొడుకైన దొరైస్వామి. శిక్షలు, సరిదిద్దే ప్రయత్నాలు కూడా చిన్నతనంలోనే ప్రారంభమయ్యాయి. టీచర్లు ఆమెను 'అబ్బాయిలా ధైర్యంగా ఉండనందుకు' కొట్టేవారు. ఐనా ఆమె అమ్మాయిలాగే ప్రవర్తించేది. ఆమెకు ఆ పద్ధతే తెలుసు. అబ్బాయిలా ఉండడమెలాగో తెలియదు. మిగిలినవాళ్లు అడుగుతున్నారు గదా అని అబ్బాయిలా ఉండలేకపోయింది. నాటకాలలో ఆడవేషాలు వేసినపుడు ఆమె ఒక పాత్ర ధరించలేదు. ఆమె అచ్చం తనలాగే ఉన్నాననుకుంది. మళ్లీ మామూలుగా మగ దుస్తులు వేసుకున్నపుడు తనలోని అసలు వ్యక్తిని వెనక్కునెట్టి మారువేషంలో వెళ్తున్నట్లనిపించేది ఆమెకు. వయసు వచ్చేసరికి మరిన్ని సందేహాలు, అయోమయాలు. ఇతర అబ్బాయిల మీద కోరిక కలగడం సరైందేనా? తనకొక్కదానికే ఇలా అనిపిస్తుందా? తనలాంటివారు ఇంకెవరన్నా ఉన్నారా? వాళ్లెక్కడ కనపడతారు? ఆమె పదో తరగతికి వచ్చేసరికి 'నా శరీరంలో నా లోపల మార్పులు జరగడం నా అనుభవంలోకి వచ్చింది. నాలో ఒక అణచిపెట్టలేని స్త్రీత్వం పెరుగుతున్న అనుభవం నాకు కలిగింది. అది నన్ను పొద్దస్తమానం వెంటాడసాగింది. నా గురించి నేను పురుషుని శరీరంలో చిక్కుకున్న స్త్రీగా అనుకున్నాను.' (రెండవ చాప్టర్ నుంచి)

తన శరీరానికి తాను పరాయిదయిపోవడం గురించి లోతైన బాధ అనుభవించి తనలాంటి మనుషుల కోసం, తనెక్కడి నుంచి వస్తోందో అర్థం చేసుకోగల మనుషుల కోసం వెదకడం మొదలుపెట్టింది. పూర్తిగా కొత్తదైన సాంస్కృతిక పదజాలాన్ని నేర్చుకుంది. తనకొక మూలాన్ని, తన ఇంట్లోలేని మూలాధారాన్ని ఇచ్చేలా అమ్మాయి పేరు పెట్టుకుంది. ఇంటికి తిరిగి వస్తూ, ఇదంతా భరించలేని సోదరుల చేతిలో దెబ్బలు తింటూ, తనకు సానుభూతిగాని, అండగానీ దొరకకపోవడంతో మళ్లీ పారిపోయింది. మళ్లీ ఇంకోసారి – తన కుటుంబంపై ఉన్న ఇష్టాన్ని తెంచుకోలేక, ఆ కుటుంబ సంకేతాలలో బతకలేక మళ్లీమళ్లీ పారిపోవాల్సి వచ్చేది. తను ఏ కమ్యూనిటీకి చెందుతుందో ఆ కమ్యూనిటీలో ఆమెకు ప్రేమ, అవగాహన దొరికినప్పటికీ, అక్కడ సర్దుబాటు చేసుకోవడం కూడా తేలిక కాదు. గౌరవంతో కూడిన సామాజిక సంబంధాలుండే ప్రాంతాలున్నప్పటికీ, నిస్సహాయత, నిందాముద్రలుండడం వల్ల వీధుల్లో వారికి హింస, తీవ్రమైన వేధింపులు ఎదురయ్యేవి. అత్యాచారం, లైంగిక వేధింపులు, అవమానాలు, మగవాళ్ల భౌతిక దాడులు తెలిసీ, తెలియకా జరుగుతుండేవి.

'ఆ సమయంలో నేను నిరాశపడేదాన్ని. మనుషులు ఇలా కూడా ఉండొచ్చు కదా అనుకునేదాన్ని. దేవుడు మమ్మల్నిలా చేశాడు అనుకునే దాన్ని. మాకంటూ ఒక పని లేదు. మా తల్లిదండ్రులు మమ్మల్ని అర్థం చేసుకోరు. ఈ ప్రపంచానికి మేమంటే అయిష్టం. వీటన్నిటికన్నా మాకు మనుషుల్లా గౌరవంగా హుందాగా జీవించాలని ఉంటుంది'ఆమె జీవితాన్ని నాశనం చేసిన హింసతో పాటు రేవతి హిజ్రా ప్రపంచంలోని ఉప సంస్కృతుల గురించి ఆసక్తికరమైన విషయాలు చెప్పింది. ఢిల్లీ, ముంబై, బెంగుళూరుల మధ్య ఉన్న భిన్నత్వాలు 'వాళ్ల సంతోషాలు, ఆచారాలు, వేషధారణ నియమాలు, ఆధిపత్యాల అంతరువులు, అధికార సంబంధాలు, ఆ కమ్యూనిటీ జమాత్ వల్ల ఒక ఇంటికి మరొక ఇంటికి మధ్య రాకపోకలపై ఆంక్షలు, కమ్యూనిటీ లోపల అనుబంధాలను నిర్మించే ఆప్యాయతలు, ఆత్మీయతలు' వీటన్నిటి గురించీ రాసింది.